ఇదేం భరోసా?



- తక్కువగా జమవుతున్న పెట్టుబడి సాయం
- విస్తీర్ణంలో కోతలు.. రైతుల ఆందోళన

దుగ్గొండి: గత ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రైతు బంధు పథకాన్ని తీసుకొచ్చింది. ఎకరాకు ఏడాదిలో రూ. 10 వేల చొప్పున రెండు విడతలుగా అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో వారం రోజులుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోంది. మొదటి విడత ఎకరాకు రూ.6 వేల చొప్పున అందిస్తోంది. ఉన్న భూమికంటే తక్కువగా డబ్బులు జమ అవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విస్తీర్ణంలో కోతలు విధించి జమ చేస్తుండడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోతలకు కారణం ఇదేనా..

దుగ్గొండి మండలం మల్లంపల్లి గ్రామపరిధిలోని సర్వే నంబర్–87లో ఆరెల్లి వీరేశం, ఆరెల్లి రమేశ్, కక్కెర్ల శశిధర్, కక్కెర్ల ఆంజనేయులు, ఏరుకొండ కవిత, కక్కెర్ల రామకృష్ణ, ఆరెల్లి వైకుంఠానికి 8.23 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే ఇందులో సర్వే నంబర్ ఆధారంగా వాస్తవ భూమి 7 ఎకరాలు ఉంది. ఇంకా 1.23 ఎకరాల భూమి అదనంగా పట్టా అయ్యింది. విస్తీర్ణానికి మించి పట్టా ఉన్న వారి నుంచి తొలగించకుండా ఈ సర్వే నంబర్‌లోని రైతులకు రైతు భరోసా పడలేదు. ఇలా అన్ని గ్రామాల్లో జరిగి ఉంటాయా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంట భూమి మొత్తానికి రైతు భరోసా సొమ్ము జమచేయాలని రైతులు కోరుతున్నారు..

మండలంలోని బంధంపల్లి గ్రామానికి చెందిన రైతు పోతు బుచ్చిరెడ్డికి మూడు సర్వే నంబర్లలో కలిపి 1.09 ఎకరాల భూమి ఉంది. ఐదు సంవత్సరాలుగా రైతుబంధు సొమ్ము జమ అవుతోంది. ఈనెల 12న ఆయనకు 20 గుంటలకు మాత్రమే రూ.3 వేలు జమయ్యాయి. ఇదేమిటి అని ఏఈఓను ప్రశ్నిస్తే స్టేటస్ తీసి చూశాడు. అందులో 1.09 ఎకరాల భూమి ఉంది. రాళ్లు రప్పలు, లేనట్లుగానే చూపించారు. అంతా సాగులోనే ఉందని చూపారు. కానీ, 29 గుంటలు తగ్గించి రైతుభరోసా సొమ్ము జమచేశారు. ఇది ఒక్క పోతు బుచ్చిరెడ్డి సమస్యే కాదు.. జిల్లా వ్యాప్తంగా అనేక మంది రైతులు ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు.



బుచ్చిరెడ్డికి చెందిన రైతు భరోసా స్టేటస్..

సగం భూమికే డబ్బులు వచ్చాయి..



నాకు నాచినపల్లిలో 2.07 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ప్రతి సంవత్సరం మొత్తం భూమికి రైతు బంధు సొమ్ము జమయ్యేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.15 వేలు ఇస్తుంది అంటే సంతోషించా.. కానీ రూ.12 వేలు అన్నారు. అయినా సరే అనుకున్నా. బుధవారం రాత్రి 1.03 గుంటలకు రూ.6450 మాత్రమే జమయ్యాయి. ఇంకా 1.04 ఎకరాలకు రైతు భరోసా పడలేదు. వ్యవసాయ శాఖ అధికారులకు చెబితే ఏం చేయలేమని చెబుతున్నారు.

– పెండ్యాల రాము, నాచినపల్లి

ఏఈఓ తెలియదంటున్నాడు..



నాకు 2.30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఉన్న భూమి అంతా సాగు చేశాను. ప్రస్తుతం మొక్కజొన్న చేను ఉంది. ఏఈఓ పంటల నమోదులోనూ 2.30 ఎకరాలు ఉంది. బుధవారం రాత్రి రెండు ఎకరాలకు రూ.12 వేలు మాత్రమే జమయ్యాయి. ఇదేందని దుగ్గొండికి పోయి ఏఈఓను అడిగితే చాలా మందివి అలాగే వస్తున్నాయి. మాకేమీ తెలియదని సమాధానం ఇచ్చారు.

– ఎక్కటి కృష్ణారెడ్డి, బంధంపల్లి

ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం..

చాలా మంది రైతులకు తమకు డబ్బులు తక్కువ జమ అయ్యాయని ఫోన్ చేస్తున్నారు. రాళ్లు, రప్పలు, బంజరు భూమి, వ్యవసాయ యోగ్యం కానివి అని చూపకుండానే విస్తీర్ణం తగ్గి భరోసా డబ్బులు జమ అయినట్లు గుర్తించాం. జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదిక అందించి రైతులకు న్యాయం చేయడానికి ప్రయత్నిస్తాం.

– దామోదర్‌రెడ్డి, ఏడీఏ, నర్సంపేట

సొసైటీ అభివృద్ధికే ప్రాధాన్యం

- పీఏసీఎస్ చైర్మన్ మురళీధర్
- ప్రత్యేక మహాజన సభ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మురళీధర్

నల్లబెల్లి : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) అభివృద్ధికే ప్రాధాన్యత ఇచ్చినట్లు చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ చెట్టుపల్లి మురళీధర్ తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్ చేసిన తప్పిదానికి తాను ప్రజల ముందు దోషిగా నిలబడాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అర్షనపల్లిలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక మహాజన సభలో 51 నోటీస్‌లో పేర్కొన్న అంశాలతోపాటు సంఘంలో చేపట్టిన, కొనసాగుతున్న అభివృద్ధి పనులను చర్చించి ఏకగ్రీవ తీర్మాణం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మురళీధర్ మాట్లాడారు. రైతుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సొసైటీని అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దినట్టు తెలిపారు. రుణమాఫీ వ్యవహారంలో కంప్యూటర్ ఆపరేటర్ తప్పు చేయగా ఆ అంశాన్ని అడ్డుపెట్టుకొని తనను రాజకీయంగా ఇబ్బందులకు గురి చేశారని వాపోయారు. ఇటీవల మృతి చెందిన డైరెక్టర్లు చల్ల యాదగిరి, చెన్నమల్ల నర్సయ్యలకు నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఇదిలా ఉండగా 51 నోటీస్‌లోని అంశాలపై విచారణ విషయమై ఓ విలేకరి ప్రశ్నించగా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజు స్పందించకపోవడంతో స్వల్ప వివాదం చోటు చేసుకుంది. వీడియో తీస్తుండగా చైర్మన్ మురళీధర్, అతడి సోదరుడు చెట్టుపల్లి దామోదర్ తనను అడ్డుకుని నెట్టేశారని సదరు విలేకరి ఆరోపిస్తూ తదనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు తక్కళ్లపల్లి మోహన్‌రావు, డైరెక్టర్లు సిద్దురి తిరుపతిరావు, ఉప్పుల రవి, కామర రమ, భూక్య దేవ్‌సింగ్, ముత్యాల సాంబయ్య, మంద రాజిరెడ్డి, శ్రీపతి కొమురయ్య, ఎల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

హింసరహిత సమాజమే లక్ష్యం

- 'సర్వోదయ' ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్

సంగెం : హింస రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్ తెలిపారు. మండలంలోని గవిచర్లలో మహిళా సహాయత కమిటీ సభ్యులకు చట్టాలపై శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో లింగ సమానత్వం కోసం పాటు పడాలని సూచించారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్నప్పటికీ సమాజంలో మహిళలు, బాలికలపై హింస కొనసాగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, బాలికలపై హింసను నివారించేలా రక్షక కమిటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సభ్యులు సమస్యల్లో ఉన్న మహిళలకు గ్రామ స్థాయిలోనే ఉచిత న్యాయ సహాయం, తాత్కాలిక ఆశ్రయం, వృత్తి నైపుణ్య శిక్షణ, జీవనోపాధి సహకారం అందించాలని చెప్పారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సిబ్బంది వాణి, అక్తర్, హేమలత, కమిటీ సభ్యులు, ఉమ, భవ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లింగమంతుల స్వామికి ఎమ్మెల్యే పూజలు



నెక్కొండ : మండలంలోని రెడ్లవాడ గ్రామంలో కొనసాగుతున్న లింగమంతుల స్వామి జాతరలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు ఉండాలని కోరినట్లు తెలిపారు. పీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, ఏఎంసీ బండి శివకుమార్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, రాచకొండ రఘు, చెన్నకేశవులు, తదితరులు ఉన్నారు.

దుర్గమ్మ ఉత్సవం



రాయపర్తి : మండలంలోని మైలారంలో శుక్రవారం దుర్గమ్మ, మారెమ్మ పండగను రెండో రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, తదితర ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు వేర్వేరుగా పాల్గొని పూజలు చేశారు.

జాతరల్లో జనసందోహం



నల్లబెల్లి : మండలంలోని నల్లబెల్లి, నాగరాజుపల్లి మద్దిమేడారం సమ్మక్క–సారలమ్మ జాతరలకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపై కొలువుదీరండంతో భక్తులు మొక్కులు చెల్లించుకొని తన్మయం పొందారు. భక్తులు తల్లులకు ఎత్తు బంగారం, వడిబియ్యం, ముడుపులు కట్టి కానుకలుగా సమర్పించారు. శివసత్తులు వడిబియ్యం కట్టుకొని బ్యాండు వాయిద్యాలతో ఆలయం చుట్టూ పూనకాలతో ప్రదక్షిణ చేశారు. మద్ది మేడారం ప్రధాన పూజారి దురిశెట్టి సమ్మయ్య దంపతులను స్థానిక మాజీ సర్పంచ్ గోనె శ్రీదేవి నూతన వస్త్రాలతో సన్మానించారు. నల్లబెల్లిలోని జాతర వద్ద ఆలయ ప్రధాన పూజారి ప్రవీణ్ జాతర ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు.

కంఠమహేశ్వర స్వామి వేడుకలు



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముత్తోజిపేటలో గౌడ కులస్తులు కంఠమహేశ్వరస్వామి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంఠమహేశ్వర స్వామికి మొక్కులు చెల్లించారు.

సన్మానం



దుగ్గొండి : యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డిని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొదిల నరేశ్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో శాలువా కప్పి పూలబొకే అందజేసి ఘనంగా సన్మానించారు. జిల్లాలోని యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రభుత్వ సహకారం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోరె రాజేశ్, గోర్కటి నవీన్‌కుమార్, పాడేటి వినోద్, కొలుగూరి కరుణాకర్ పాల్గొన్నారు.

'ఎంపీటీసీల సంఖ్య పెంచాలి'

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి, గురిజాల గ్రామాల్లో ఎంపీటీసీ స్థానాలు పెంచాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. నర్సంపేటలోని కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటుకాలపల్లిలో 4904 మంది ఓటర్లు ఉండగా గురిజాలలో 6029 మంది ఉన్న క్రమంలో సదరు రెండు స్థానాల్లో అదనంగా ఒక్కోటి పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక



సమీక్షిస్తున్న డీఆర్‌డీఓ కౌసల్యాదేవి

దుగ్గొండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ శుక్రవారం నిర్వహించారు. ఏడాదిపాటు మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో రూ. 4 కోట్ల 91 లక్షల 51 వేల విలువైన పనులు చేశారు. రూ.3 కోట్ల 56 లక్షల 71 వేలు కూలీలకు చెల్లించగా, రూ.1కోటి 34 లక్షల 8 వేల మెటీరియల్ పనులు జరిగాయి. వారం రోజులపాటు సామాజిక తనిఖీ కార్యకర్తలు గ్రామాల్లో తనిఖీలు చేసి ప్రజావేదికలో ప్రజల ముందు ఉంచారు. ఈమేరకు గ్రామాల వారీగా వివరాలను డీఆర్డీఓ కౌసల్యాదేవి సమీక్షించారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కల వివరాలకు క్షేత్రస్థాయిలో ఉన్న మొక్కలకు పొంతన లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత బాధ్యుల నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. కొన్ని పనుల్లో నాణ్యతపై సామాజిక తనిఖీ బృందం అనుమానాలు వ్యక్తం చేయగా క్వాలిటీ కంట్రోల్‌కు సిఫార్సు చేశారు. మొత్తంగా రూ.52,799 అవినీతి జరిగిందని తేల్చారు. పీఆర్ ఏఈ నుంచి 30,709, పంచాయతీ కార్యదర్శుల నుంచి 6,600, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.1,600, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి రూ.391, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రూ.1477, ఏపీఓ రూ.1000, చెల్లింపులు ఎక్కువగా అందుకున్న రైతుల నుంచి రూ. 11,022 రికవరీ చేయాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లెక్కల అరుంధతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, ఏపీఓ శ్రీనివాస్, ఈసీ రాజు, సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అన్నారంలో తలనీలాలు మాయం

- వక్ఫ్‌బోర్డ్‌కు ఏటా రూ.లక్షలు నష్టం
- పట్టించుకోని అధికారులు

పర్వతగిరి : మండలంలోని అన్నారం యాకూబ్ బాబు దర్గాలో భక్తులు సమర్పించే తలనీలాలను మాయం చేస్తున్నారు. ఏటా వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో తలనీలాలకు వేలం నిర్వహిస్తారు. 2022–23లో రూ.28 లక్షలకు తలనీలాలకు వేలం వేశారు. 2024–25లో తలనీలాల డబ్బులు కాజేస్తూ కొందరు వక్ఫ్‌బోర్డు ఆదాయానికి గండి కొట్టారు. పోగు చేసిన తలవెంట్రుకలను అడిషనల్ కలెక్టర్ ద్వారా అమ్మాల్సి ఉండగా స్థానికులతో కలిసి ఓ అధికారి చాటుగా అమ్ముతున్నాడని ఆరోపణలు వస్తున్నాయి. వక్ఫ్‌బోర్డుకు రూ.28 లక్షల ఆదాయం రావాల్సి ఉండగా.. రెండు సంవత్సరాల్లో కనీసం రూ.10 లక్షలు రాకపోవడం గమనార్హం. 25 మంది వక్ఫ్‌బోర్డు సిబ్బంది ఉన్నా విధులు నిర్వర్తించడంలో అలసత్వం వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తలనీలాలు అమ్మి వక్ఫ్‌బోర్డు ఆదాయానికి గండి కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



అన్నారం షరీఫ్ దర్గా



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

త్వరలో టెండర్లు..



త్వరలో తలనీలాల టెండర్లు నిర్వహిస్తాం. రెండేళ్ల వ్యవధిలో తలనీలాల నిధులను సుమారు రూ.7 లక్షలు జమ చేశాం. వక్ఫ్‌బోర్డుకు రూ.50 లక్షలు నష్టం వచ్చిన మాట వాస్తవమే.

– రియాజ్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

వర్ధన్నపేట : ఇసుక రవాణాలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్థానిక ఎస్సై చందర్ స్పష్టం చేశారు. మండలంలోని కొత్తపల్లి, ల్యాబర్తి ఆకేరు వాగు పరివాహక ప్రాంతంలోని రహదారుల్లో ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసే దిశగా పోలీసులు శుక్రవారం చర్యలు చేపట్టారు. జేసీబీతో కందకాలు తవ్వించారు. ఈ సందర్భంగా ఎస్సై చందర్ మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా నిరంతరం పెట్రోలింగ్ చేస్తామన్నారు. ఉప్పరపల్లి క్రాస్ రోడ్డ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసినటుట్ట తెలిపారు. ఇసుక అక్రమ రవాణా నిరోధానికి ప్రజలు సహకరించాలని కోరారు.



జేసీబీతో కందకాలు తవ్విస్తున్న పోలీసులు

ఎన్నిక

వర్ధన్నపేట : బీఆర్ఎస్ అనుబంధ సంఘాల వర్ధన్నపేట పట్టణ కమిటీల అధ్యక్షులను ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం ఎన్నుకున్నారు. ఎస్సీ సెల్‌కు అయిత ఎల్లయ్య, బీసీ సెల్‌కు ఆరెల్లి నాగార్జున, మహిళ సెల్‌కు ఈరెల్లి యాకమ్మ, మైనారిటీ సెల్‌కు రహీమ్, కార్మిక సెల్‌కు భూమా రమేశ్, రైతు విభాగానికి దేవేందర్‌రావు, ఎస్టీ సెల్‌కు ఆంగోతు రాము, ఆటో యూనియన్‌కు కన్నం కుమార్ ఎన్నికయ్యారు.

గంజాయి పట్టివేత..!

ఖానాపురం : మండల కేంద్ర శివారులో పోలీసులు గంజాయి పట్టుకున్నట్లు తెలిసింది. ఒరిస్సా నుంచి వరంగల్‌కు వాహనాల్లో అక్రమంగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్సై రఘుపతి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టినట్లు సమాచారం. పోలీసులు అనుమానితులను తనిఖీ చేయగా సుమారు 5–10 కేజీల గంజాయి లభించినట్లు ప్రచారం జరుగుతోంది. పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

ఇద్దరిపై కేసు నమోదు

చెన్నారావుపేట : గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా.. మహబూబాబాద్ జిల్లాకు చెందిన బండి శ్రావణ్‌కుమార్, రాకేశ్ వరంగల్‌కు గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో మండలంలోని లింగగిరి క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై నాలుగు కేజీల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. నిందితుల నుంచి గంజాయితోపాటు, బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సేవాలాల్ జయంతి వేడుక

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని జంగాలపల్లితండాలో సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకను శుక్రవారం నిర్వహించారు. తండావాసులు సేవాలాల్ మహరాజ్ చిత్రపటం వద్ద కొబ్బరి కాయలు కొట్టి పూజలు నిర్వహించారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

నెక్కొండ : మండలంలోని మహబూబ్‌నాయక్ తండాలోని గుడుంబా స్థావరాలపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ మీడియాకు వివరాలు వెల్లడించారు. రెండు స్థావరాల్లో దాడులు నిర్వహించి 25 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతోపాటు 1500 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. గుడుంబా తయారీకి, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చెప్పారు.

ఆర్థికసాయం

నర్సంపేట : పట్టణంలోని సరోజినీదేవి రోడ్డుకు చెందిన ఆటో మెకానిక్ పుల్లూరి కరుణాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి స్నేహితులు రూ.16300 సాయం అందజేశారు. స్నేహితుల ద్వారా సమకూర్చిన డబ్బును కరుణాకర్ కుటుంబానికి అతడి స్నేహితుడు వంగపండ్ల రాజు అందజేశారు. తొలుత కరుణాకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆకుల మహేందర్, వైనాల రాజేశ్, గుర్రం భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



గీసుకొండ : మండలంలోని కొమ్మాలలో ఎంసీపీఐ (యూ) మాజీ రాష్ట్ర కార్యదర్శి తాండ్ర కుమార్ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు శనివారం నివాళులర్పించారు. కుమార్ మూడో వర్ధంతి నిర్వహించారు. కుమార్ ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాయకులు గూడ సురేశ్, బండి బుచ్చన్న, సోమిడి రవి, జక్కుల రాజు, ఈర్ల బుచ్చయ్య, దూడయ్య, మల్లయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



వర్ధన్నపేట : పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళ 108లోనే ప్రసవించింది. వివరాలిలా.. మండలంలోని డీసీతండాకు చెందిన భూక్యా కవితకు శుక్రవారం పురిటి నొప్పులతో ఇబ్బంది పడుతుండగా 108కు సమాచారం అందించారు. ఆమెను 108లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ మహేశ్, పైలట్ కుమార్ చికిత్స అందించడంతో ఎలాంటి ప్రాణాపాయం లేకుండా మగ బిడ్డకు జన్మనిచ్చింది. కవితను, శిశువును స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వర్ధన్నపేట : షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన నల్లబెల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు పొన్నం పరశురాములు కథనం ప్రకారం.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో వస్తువులు కాలిపోయాయి. క్వింటా బియ్యం, ధాన్యంతోపాటు రూ.65 వేల నగదు కాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

గడ్డివాము..

నెక్కొండ : ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన ఘటన మండలంలోని చింత నెక్కొండ క్రాస్‌లో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధిత రైతు శ్రీనివాస్ కథనం ప్రకారం.. శ్రీనివాస్ ఖరీఫ్‌లో ఐదెకరాల్లో వరి సాగు చేశాడు. ఈ క్రమంలో తన ఇంటి సమీపంలో గడ్డివాము ఉంచగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. కుటుంబ సభ్యులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా సుమారు రూ.లక్ష మేరకు నష్టం వాటిల్లిందని శ్రీనివాస్ వాపోయాడు.

నియామకం



గీసుకొండ : మండలంలోని బొడ్డుచింతలపల్లికి చెందిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కేదాసి మోహన్ బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) రాష్ట్ర అవార్డుల సెలక్షన్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మోహన్ విలేకరులతో మాట్లాడారు. మార్చి 25న నిర్వహించనున్న అకాడమీ 18వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో అవార్డుల ఎంపిక కోసం దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. జ్యోతిరావుఫూలే, డాక్టర్ అంబేడ్కర్, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం సేవా, సాహిత్య రత్నతోపాటు పలు అవార్డులకు సామాజిక ఉద్యమకారులు, కవులు, కళాకారులు, రచయితలు, సంఘ సేవకులు, గాయకులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

'గంగదేవిపల్లి' విజయాలపై అధ్యయనం



అనంతపురం సభ్యులతో రాజమౌళి, తదితరులు

గీసుకొండ : జాతీయ ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన మండలంలోని గంగదేవిపల్లి సాధించిన విజయాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లాకు స్వచ్ఛంద సంస్థల సభ్యులు శుక్రవారం అధ్యయనం చేశారు. అనంతపురం జిల్లాకు చెందిన రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఎన్‌జీవో)లో కళ్యాణదుర్గం రీజియన్‌లో పని చేస్తున్న ఆత్మకూరు, కళ్యాణదుర్గం, కుందుర్పి, కందుకూరు, శెట్టూరు, బ్రహ్మసముద్రం, బెలుగుప్ప మండలాలకు చెందిన గ్రామాల నుంచి 38 మంది పలు కమిటీల సభ్యులు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆ ట్రస్టు హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ట్రెయినర్లు రామాంజనేయులు, శ్రీనివాసులు, ఏరియా టీం లీడర్లు సురేంద్ర, సురేశ్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సలీం పాషా, పుల్లమ్మలకు గంగదేవిపల్లి సాధించిన విజయాలపై జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వివరించారు. కార్యక్రమంలో వితంతువుల కమిటీ అధ్యక్షురాలు మేడిద సుశీల, రిసోర్స్ పర్సన్ గూడ సరోజన, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- న్యూడెమోక్రసీ కార్యదర్శి రాజేందర్

నర్సంపేట : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ విమర్శించారు. ఈనెల 20న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమ వాల్‌పోస్టర్లను పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం రాజేందర్ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడచినా మహిళలకు ఉచిత ప్రయాణం మినహా మిగతా ఐదు గ్యారంటీలను అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పాలన మోసపూరితంగా సాగుతోందని ధ్వజమెత్తారు. ఉద్యోగాల భర్తీలోనూ నిర్లక్ష్యం రాజ్యమేలుతోందని మండిపడ్డారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భోగి సారంగపాణి, జక్కుల తిరుపతి, సాంబయ్య, వెంకటేశ్వర్లు, పీవైఎల్ జిల్లా నాయకుడు రంజిత్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పూలక్క, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గొర్రె ప్రదీప్, సుమన్, తదితరులు పాల్గొన్నారు

జాతీయ స్థాయిలో ప్రతిభ

పర్వతగిరి : మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థిని రుచిత జాతీయ స్థాయి ఫెన్సింగ్ గేమ్‌లో ప్రతిభ చాటి రజత పతకం సాధించిందని ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. ఈ సందర్భంగా రుచితను కళాశాల ఆవరణలో శుక్రవారం ఆమె అభినందించి మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో రుచిత రజత పతకం సాధించినట్టు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నెక్కొండ : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. సాయిరెడ్డిపల్లిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పర్వతగిరి మండలంలోని కల్లెడకు చెందిన దాసరి సారయ్య ల్యాబర్తి వాగు నుంచి నెక్కొండకు ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై మహేందర్ తెలిపారు. సారయ్యపై కేసు నమోదు చేశామని చెప్పారు.